సాక్షి కామారెడ్డి
గురువారం । 16 । మార్చి । 2023



ఇల్లు రాలేదని..

కామారెడ్డి బల్దియాలో డబుల్ బెడ్ రూం ఇల్లు దక్కని పేదలు వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్నారు.

- 8లో ▸



ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే సురేందర్ బుధవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /15.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాలలో వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్ష సూచన

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో ఈనెల 16, 17, 18 తేదీల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

మంత్రి పర్యటనకు వైద్యులు.. రోగులకు ఇబ్బందులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఓపీ విభాగంతో పాటు, ఎమర్జెన్సీ వార్డులకు వచ్చిన రోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిట్లంలో బుధవారం మంత్రి కేటీఆర్ సభ నేపథ్యంలో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు వైద్యులతో పాటు మూడు అంబులెన్స్‌లు, ల్యాబ్, ఎక్స్‌రే టెక్నిషియన్‌లను అక్కడికి పంపించారు. వారు ఉదయం 6 గంటలకు వెళ్లి సాయంత్రం 7 గంటలకు వచ్చారు. దీంతో బుధవారం ఆస్పత్రిలో రోగులకు సరైన వైద్య సేవలు అందలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా వీఐపీల పర్యటనలకు వైద్యులు, వైద్య సిబ్బందిని పంపుతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి చర్యలతో రోగులు ఇబ్బందిపడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. మంత్రి పర్యటనకు వెళ్లిన తమకు కనీసం భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదని వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.

5,509 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగులో భాగంగా బుధవారం 5,509 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 704 మందికి రీడింగ్ అద్దాలను అందించారు. మరో 821 మందికి కావాల్సిన అద్దాల కోసం ఆర్డర్ పెట్టామని అధికారులు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు..



కామారెడ్డి అర్బన్: జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం మెడివిజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. 80 మంది విశ్రాంత ఉద్యోగులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. 11 మందికి కంటి అపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి హైదరాబాద్‌లోని మెడివిజన్ ఆస్పత్రిలో ఉచితంగా అపరేషన్లు చేస్తారని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉపేందర్, అర్జున్‌రావు, శ్యాంరావు, నాగగౌడ్, మహమూద్, నరసయ్య, బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 30 మంది ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లా ఉపాధి కల్పనశాఖ, రిలయన్స్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. శ్రీవిజయ బయోఫర్టిలైజర్స్, ఉమెన్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్, వరుణ్ మోటార్స్, సువర్ణభూమి, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎల్అండ్‌టీ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ప్రథమ్ ఫౌండేషన్, టాటా స్ట్రైవ్ కంపెనీలు ఈ మేళాలో పాల్గొన్నాయి. ఇందులో 30 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కిష్టయ్య తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, సమన్వయకర్త రామకృష్ణ, ఉపాధి కల్పనాధికారి సాయిలు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు రాజు, శ్వేత, కళాశాల ప్లేస్‌మెంట్ సమన్వయకర్త ఫర్వీన్ ఫాతిమ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ద్వారా సీతారాముల కల్యాణ తలంబ్రాలు

ఖలీల్‌వాడి : ఆర్టీసీ కార్గో ద్వారా భద్రాచలంలోని సీతారాముల దేవస్థానం నుంచి సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఉమ్మడి జిల్లా ప్రజలకు అందజేస్తామని ఆర్ఎం ఉషాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాముల తలంబ్రాలు తక్కువ ధరలో మీ ఇంటికే తెప్పించుకొనే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని గురువారం నుంచి ప్రారంభిస్తున్నామని, ఒక ప్యాకెట్ ధర రూ. 116 చెల్లించి ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ల ద్వారా బుక్ చేసుకోవాలన్నారు. వివరాలకు ఆర్టీసీ రీజినల్‌లోని డిపోమేనేజర్లను సంప్రదించాలన్నారు.

✤ ఆర్మూర్ డిపో	9550232626
✤ బోధన్	9014296638
✤ నిజామాబాద్-1	9154298727
✤ నిజామాబాద్-2	7396889496
✤ బాన్సువాడ	9154298729
✤ కామారెడ్డి	9154298730
✤ ఆర్ఎం ఆఫీస్	91542 98731, 91542 98732

అభివృద్ధిని వివరిస్తూ.. హామీలిస్తూ..

- ఎన్నికల సమరశంఖం పూరించిన కేటీఆర్!
- ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డ మంత్రి
- జుక్కల్‌లో సింధేను 72 వేల మెజారిటీతో గెలిపించాలని వినతి

పిట్లంలో బీఆర్ఎస్ నిర్వహించిన సభ ఎన్నికల సభను తలపించింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఇదే సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేసిన అభివృద్ధిని వివరించారు. పనిలోపనిగా పార్టీ జుక్కల్ అభ్యర్థిని తేల్చేశారు. దీంతో ఈ సభా వేదికగా మంత్రి కేటీఆర్ వచ్చే ఎన్నికలకు సమరశంఖం పూరించారన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.



పిట్లం సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై స్పీకర్ పోచారం, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, సింధే, సురేందర్, గణేశ్‌గుప్తా

సాక్షి, కామారెడ్డి/నిజాంసాగర్/పిట్లం : మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ జుక్కల్ నియోజకవర్గ పర్యటన విజయవంతమైంది. ఆయన ముందుగా నిజాంసాగర్ మండల కేంద్ర సమీపంలో మంజీర నదిపై రూ. 25 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం మంజీర నదిపై రూ.470 కోట్లతో చేపట్టిన నాగమడుగు వద్ద ఎత్తిపోతల పథకానికి జక్కాపూర్ వద్ద శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. అక్కడినుంచి పిట్లం వెళ్లి బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ''వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలిచి, అధికారం చేపడుతుంది. సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా. జుక్కల్ నుంచి గత ఎన్నికల్లో హన్మంత్ సింధేను 36 వేల మెజారిటీతో గెలిపించారు. ఆయన నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఈసారి 72 వేల మెజారిటీతో గెలిపించాలి. మీ కోరికలన్నీ తీర్చే బాధ్యత నాది'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం తపించే హన్మంత్ సింధే ఎమ్మెల్యేగా ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరిన మంత్రి.. అభివృద్ధి గురించి ఏనాడూ ఆలోచించని కాంగ్రెస్, అభివృద్ధికి సహకరించని బీజేపీలను తుక్కుతుక్కుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

విపక్షాలపై విమర్శల దాడి

జుక్కల్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గంగారాంపై కేటీఆర్ విమర్శలు చేశారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిందేమీ లేదన్నారు. ఆయన ఓట్ల కోసం వస్తే రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి ఎందుకు ఇవ్వలేదో ప్రశ్నించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణను శత్రువుగా చూస్తూ అన్నింటా అన్యాయం చేస్తోందని, ఆ పార్టీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాకుండా చూడాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



పిట్లం సభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు

సంక్రాంతి ముందు వచ్చే గంగిరెద్దులోళ్లలాగా కాంగ్రెస్, బీజేపీ నేతలు వస్తారని, వారి మాటలను నమ్మవద్దని కోరారు.

జిల్లాలో రెండో అభ్యర్థి ఖరారు!

ఇటీవల సీఎం కేసీఆర్ బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ సీఎంగా తాను ఉన్నన్ని రోజులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉంటారని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో తిరిగి పోటీ చేసేది పోచారమే అన్న విషయాన్ని పరోక్షంగా వెల్లడించారు. బుధవారం పిట్లంలో నిర్వహించిన సభలో సింధేను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలంటూ మంత్రి కేటీఆర్ పేర్కొనడంతో జిల్లాలో మరో స్థానానికి అభ్యర్థిని ఖరారు చేసినట్లయ్యింది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉండగా.. రెండు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులెవరో తేలిపోయింది.



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

సింధేపై ప్రశంసల వర్షం

జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధేపై మంత్రి కేటీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన హయాంలో జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా మారిందన్నారు. నీటి పారుదల శాఖలో ఇంజినీరుగా పనిచేసిన సింధే.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఆయన ఏనాడూ సొంత పనుల కోసం తమను కలవలేదన్నారు. రూ.472 కోట్లతో 40 వేల ఎకరాలకు సాగునీరందించే నాగమడుగు ప్రాజెక్టును చేపట్టి ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీరుస్తున్నాడన్నారు.

పిట్లం, బిచ్కుందవాసుల్లో చిగురించిన ఆశలు

జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం, బిచ్కుంద మండల కేంద్రాలను మున్సిపాలిటీలుగా చేసుకుందామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బాన్సువాడను విషయంలో తానే స్పీకర్ పోచారంతో మాట్లాడి మున్సిపాలిటీ చేశానన్నారు. బాన్సువాడ పట్టణం మున్సిపాలిటీ అయిన తర్వాత ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పిట్లం, బిచ్కుంద పట్టణాలను కూడా మున్సిపాలిటీలుగా చేసి అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రజల తరపున ఎమ్మెల్యే కోరిన అన్ని పనులన మంజూరు చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. నియోజకవర్గంలో గతంలో 92 గ్రామాలకు రోడ్లు లేవన్నారు. హన్మంత్ సింధే 72 రోడ్లు వేయించారని, మిగతా 20 రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. పిట్లం, బిచ్కుందలను బల్దియాలు చేస్తామని కేటీఆర్ హామీ ఇవ్వడంతో ఈ ప్రాంతవాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, బిగాల గణేశ్‌గుప్తా, జాజాల సురేందర్, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావ్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఐజీ రమేశ్‌నాయుడు, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



జక్కాపూర్ వద్ద నాగమడుగు పైలాన్ రిబ్బన్ కట్ చేస్తున్న మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి

కవితమ్మా.. భయపడకమ్మా...

దేశంలో నరేంద్రమోదీ నియంతృత్వ పాలనను సీఎం కేసీఆర్ ప్రశ్నిస్తున్నారని, అందుకే ఆయన కూతురు ఎమ్మెల్సీ కవితమ్మను టార్గెట్ చేసి వేధిస్తున్నారని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రశ్నించిన వారిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేధిస్తోందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలంతా కవితమ్మకు అండగా ఉన్నారని, నియంతృత్వంపై పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కేసీఆర్, కేటీఆర్‌లు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ వివిధ దేశాల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చారని పేర్కొన్నారు. 25 వేల పరిశ్రమలు తీసుకురావడం ద్వారా రూ. 2.60 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. వాటిద్వారా 17.50 లక్షల మందికి ఉద్యోగాలు సమకూరాయని పేర్కొన్నారు.



సభలో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

అమరుల స్థూపాన్నీ వదల్లేదు..

- సవాల్ విసిరినా స్పందించని మంత్రి
- కొడుకులకు మండలాలు పంచిన స్పీకర్
- ఆర్మూర్ ఎమ్మెల్యేదీ అవినీతి కథే
- వెంచర్లలో అర్బన్ ఎమ్మెల్యేకు వాటాలు
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విమర్శలు



నగరంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్, తాహెర్ తదితరులు

ఖలీల్‌వాడి : తెలంగాణ అమరవీరుల స్థూపం, అంబేడ్కర్ విగ్రహం, సచివాలయం నిర్మాణాల్లో అవినీతి చోటు చేసుకుందని, మూడు రోజులుగా మంత్రి ప్రశాంత్ రెడ్డికి సవాల్ చేస్తే ఇంతవరకు స్పందించలేదని పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర అనంతరం నెహ్రూపార్క్ వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మంత్రి ఎక్కడికి పిలిచినా వెళ్లి అవినీతిని రుజువు చేస్తానన్నారు. మంత్రి స్పందించకుండా తాబేదారులతో మాట్లాడించడం సరికాదన్నారు. అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వాటాలివ్వాలని ఒత్తిడి తీసుకొచ్చి లబ్ధి పొందుతున్నారన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అరాచకాలు ప్రజలందరికీ తెలుసేనన్నారు. రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సంగతి కూడా అందరికీ తెలుసన్నారు. స్పీకర్ పోచారం తన కొడుకులకు నియోజకవర్గంలోని మండలాలను సగం సగం పంచేశారన్నారు. ఇసుక, కంకరతో పాటు పనుల కాంట్రాక్టులు వీరి చేతుల్లోనే ఉంటాయన్నారు. ఎమ్మెల్సీ కవిత ఎంపీగా ఉన్న సమయంలో వంద రోజుల్లో షుగర్ ఫ్యాక్టరీని తెరుస్తానని చెప్పి మాట తప్పారన్నారు. అందుకే రైతులు ఎన్నికల్లో పోటీ చేసి ఆమెకు గుణపాఠం చెప్పారన్నారు. ఎంపీ అర్వింద్ బాండ్ పేపర్‌లో ఐదు రోజుల్లో పసుపుబోర్డు తెస్తానని రాసిచ్చి ఊసేత్తడం లేదన్నారు.

రావులను గెలిపిస్తే ఏమీ రావు..

రావులను గెలిపిస్తే భవిష్యత్‌లో ఏమీ రావని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ 2024 జనవరిలో అధికారంలోకి రాగానే రైతులకు రుణామాఫీ చేస్తామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు పెంచుతామన్నారు. ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. గ్యాస్ సిలిండర్‌ను రూ. 500లకే ఇస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మైనారిటీలకు రిజర్వేషన్‌ల పేరుతో మోసం చేస్తోందన్నారు. వైఎస్సార్ హయాంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చారన్నారు. జిల్లాలో తెయూ, మెడికల్ కళాశాల, ప్రాణహిత చేవేళ్ల పనులు చేపట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీని జిల్లాలోని ఐదు నియోజకవర్గంలో గెలిపించాలని ప్రజలను కోరారు. నిజామాబాద్ తెలంగాణ పోరాట పటిమ ఉన్న జిల్లా అన్నారు. తెలంగాణ ఆమరవీరుల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణను బీఆర్ఎస్ పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, అర్బన్ ఇన్‌ఛార్జ్ తాహెర్ బిన్ హుందాన్, శేఖర్‌గౌడ్, ముప్పా గంగారెడ్డి, గడుగు గంగాధర్ ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 38 పరీక్ష కేంద్రాలలో మొదటి రోజు ఇంటర్ ఫస్టియర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ల నుంచి ఉదయం 8.30 గంటలకు ప్రశ్నపత్రాలను సెంటర్‌లకు తరలించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పత్రాలను ఓపెన్ చేశారు. 9,956 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 9,443 మందే హాజరయ్యారు. మాచారెడ్డిలో తొమ్మిది మంది, దొమకొండలో ఇద్దరు విద్యార్థులు నిమిషం ఆలస్యంగా వచ్చారు. దీంతో వారిని పరీక్ష కేంద్రాలలోకి అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.



కామారెడ్డి సాందీపని జూనియర్ కళాశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

అధికారుల పర్యవేక్షణ

కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిజాంసాగర్ మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం జిల్లా కేంద్రంలోని సాందీపని సెంటర్‌ను పరిశీలించారు.

నిబంధనలకు పాతర

ఇంటర్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని అధికారులు ఆదేశించారు. కానీ జిల్లా కేంద్రంలో చాలా చోట్ల జిరాక్స్ సెంటర్లను తెరిచే ఉంచారు. డీఎస్పీ కార్యాలయం సమీపంలోని రెండు జిరాక్స్ కేంద్రాలు తెరిచి ఉన్నాయి. జన్మభూమిరోడ్, విద్యానగర్ కాలనీలలో రెండు పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న నాలుగు జిరాక్స్ సెంటర్‌లు మూసి వేయలేదు. నిజాంసాగర్ చౌరస్తా, దేవునిపల్లిరోడ్, కొత్తబస్టాండ్, పాత బస్టాండ్, జాతీయ రహదారి పక్కనున్న జిరాక్స్‌సెంటర్‌లు తెరిచి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



దోమకొండ: పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు విద్యార్థులు,



కామారెడ్డిలో తెరిచి ఉన్న జిరాక్స్ సెంటర్లు

ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కామారెడ్డి అర్బన్: రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను బుధవారం ఎంపిక చేశారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19న హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు.

ఎంపికైంది వీరే..

సవిత, రేఖ, మనోజ్ఞ, స్వప్న, లక్ష్మి, నవీత, సౌమ్య, మేఘన, పూజ, భూమిక, రజని, మేఘన, సుస్మిత, రక్షిత.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కామారెడ్డి టీపీవోగా దేవరాజు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీవో)గా దేవరాజు నియమితులయ్యారు. మెదక్ బల్దియాలో టీపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ప్రభుత్వం టీపీవోగా పదోన్నతి కల్పించి కామారెడ్డికి బదిలీ చేసింది. ఆయన బుధవారం మెదక్ మున్సిపాలిటీలో రిలీవ్ అయ్యి కామారెడ్డికి వచ్చారు. గురువారం కామారెడ్డి టీపీవోగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన 'సాక్షి'తో తెలిపారు.

కామారెడ్డి బల్దియాలో ప్రస్తుతం ఒక టీపీవో గిరిధర్ విధుల్లో ఉన్నారు. దేవరాజు రాకతో ఇద్దరు టీపీవోలు అందుబాటులో ఉండనున్నారు. ఇంకా మూడు టీపీఎస్, రెండు టీపీబీవో పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

నేడు ఎల్లారెడ్డిలో 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో గురువారం డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తహసీల్దార్ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ కోసం ఇటీవల దరఖాస్తులు స్వీకరించారు. డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. గురువారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, పీహెచ్‌సీ కేటగిరీలలో లక్కీడ్రా నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. జనరల్ కేటగిరీకి సంబంధించి ఉదయం 11 గంటలకు వార్డుల వారీగా లక్కీ డ్రా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైనవారు ఆయా వార్డుల పరిధిలో నిర్వహించే లక్కీ డ్రాలో పాల్గొనాలని సూచించారు.

వార్డులవారీగా డ్రా తీసే స్థలాలు..

వార్డు	డ్రా ప్రదేశం
1.	ఎర్రమన్న కుచ్చ హనుమాన్ మందిరం
2.	పోచమ్మ ఆలయం
3.	న్యూ వెంచర్
4.	పోసాన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం
5.	గండిమాసానిపేట కౌన్సిలర్ కార్యాలయం
6.	గాంధీనగర్ ఐసీడీఎస్ కార్యాలయం
7.	ముదిరాజ్ సంఘం
8.	బందర్ కిరాణ వర్తక సంఘం
9.	వైశ్యభవన్
10.	రిక్షాకాలనీ అంగన్‌వాడీ భవనం
11.	లింగారెడ్డిపేట మహిళా సమాఖ్య భవనం
12.	హౌజింగ్ బోర్డు పార్క్

కేసీఆర్ కోసం దేశం చూస్తోంది

- కేటీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తాం
- పిట్లం సభలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నిజాంసాగర్: తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ రాష్ట్రాల్లో అమలు చేయాలని కేసీఆర్ నాయకత్వం కోసం దేశమంతా ఎదురు చూస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ పెట్టడంతో పక్కనే ఉన్న మహారాష్ట్రాలో బీజేపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. బుధవారం పిట్లంలో నాగమడుగు ఎత్తిపోతల శంకుస్థాపన సభలో స్పీకర్ మాట్లాడారు. కాళేశ్వరం ద్వారా కొండ పోచమ్మ సాగర్‌కు అక్కడి నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి గోదావరి నీళ్లు వస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో నిజాంసాగర్‌లో నీళ్లు నిండుగా ఉంటాయని అక్కడి నుంచి వచ్చే నీళ్లతో నాగమడుగు కళకళలాడుతుందని చెప్పారు. మంత్రి కేటీఆర్ దేశ, విదేశాల పారిశ్రామికవేత్తలను ఒప్పించి పరిశ్రమలను తీసుకు వస్తున్నారన్నారు. దీంతో యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో తండ్రి, తనయులు ఇద్దరూ శక్తి కొద్ది పని చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వం కోసం దేశం ఎదురు చూస్తోందని, కేటీఆర్ నాయకత్వాన్ని మనమందరం బలపరుద్దామన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నాగమడుగు పైలాన్ వద్ద మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి కేటీఆర్

'నాగమడుగు'తో చిరకాల వాంఛ తీరనుంది



నాగమడుగు ఎత్తిపోతల పథకం శంకుస్థాపన పనులతో జుక్కల్ నియోజకవర్గం ప్రజల చిరకాల వాంఛ తీరనుందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే అన్నారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్, కేటీఆర్‌తో ఉంటానని చెప్పారు. సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం సహకారంతో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యే కాక ముందు 90 గ్రామాలకు బీటీ రోడ్లు లేవన్నారు. తాను గెలిచాక 70 గ్రామాలకు బీటీ రోడ్లు వేయించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో రెండు ఆర్అండ్‌బీ వంతెనలు, పిట్లం, బిచ్కుందను మున్సిపాలిటీ చేయాలని కోరారు. రామలింగేశ్వరస్వామి ఆలయం, కౌలాస్ కోటా, మద్నూర్, సలాబత్‌పూర్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్ మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను, మద్నూర్‌కు డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని కోరారు. లెండికి రూ.200 కోట్లు మంజూరు చేస్తే 22 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందన్నారు. మహమ్మద్‌నగర్‌ను మండలం చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

మంత్రి కేటీఆర్ పర్యటన ఇలా

మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ హెలీక్యాప్టర్ బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు గోర్గల్ శివారులో ల్యాండింగ్ అయ్యింది. మంత్రి కేటీఆర్‌కు జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ దంపతులు స్వాగతం పలికారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి ప్రత్యేక వాహనంలో మంజీర నదికి వద్దకు వెళ్లారు. రూ.25 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. అనంతరం నాగమడుగు ఎత్తిపోతల పథకం పైలాన్‌ను ఆవిష్కరించారు. అక్కడి నుంచి పిట్లం మండలం అన్నారం చేరుకొని బీఆర్ఎస్ సీనియర్ నేత వెంకట్రాంరెడ్డి నివాసం వద్ద భోజనం చేశారు. తర్వాత పిట్లం జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకున్నారు. సాయంత్రం 3.50 గంటలకు మంత్రి గోర్గల్ హెలీప్యాడ్ వద్దకు చేరుకొని హైదరాబాద్‌కు వెనుదిరిగి వెళ్లారు.



నాగమడుగు మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

అభివృద్ధి పనులకు పెద్ద పీట

నిజాంసాగర్(జుక్కల్): సంక్షేమ పథకాలు అమలుతో పాటు అభివృద్ధి పనులకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.కోటితో నిర్మించిన పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌ను స్థానిక ఎమ్మెల్యే హన్మంత్ సింధేతో కలిసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, జెడ్పీ మాజీ చైర్మన్ రాజు, ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి, నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ తదితరులున్నారు.



పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

'డబుల్' ఇల్లు రాలేదని వాటర్ ట్యాంక్ ఎక్కిన బాధితుడు



కిరణ్‌కుమార్, నీల దివ్యను సముదాయిస్తున్న పోలీసులు



ట్యాంక్‌పై కిరణ్‌కుమార్

కామారెడ్డి రూరల్: తనకు అర్హత ఉన్న డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన గూడెల్లి కిరణ్ కుమార్ వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశాడు. తనకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చేవరకు కిందకు రానని భీష్మించుకు కూర్చున్నాడు. గంటపాటు ట్యాంక్ పైనే ఉండి హల్‌చల్ చేయడంతో దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కిరణ్‌కుమార్‌ను సముదాయించారు. అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కిరణ్‌కుమార్ కిందకు దిగాడు. అలాగే దేవునిపల్లికి చెందిన నీల దివ్య అనే మహిళ కూడా తనకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ వాటర్ ట్యాంక్ ఎక్కడానికి యత్నించింది. అయితే ఆమెకు ఆపరేషన్ కావడంతో ట్యాంక్ ఎక్కడానికి అవస్థపడింది. గ్రామస్తుల కోరిక మేరకు ఆమె కిందికి దిగింది. దేవునిపల్లిలో ఇళ్లు ఉన్న వారికే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించారని అర్హులకు ఇవ్వలేదని వారు ఆరోపించారు. అధికారులు స్పందించి అర్హులకు అందించాలని బాధితులు కోరుతున్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

లింగంపేట: గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని డీఆర్‌డీవో సాయన్న సూచించారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏలు, ఎఫ్ఏల సమావేశంలో మాట్లాడారు. ఈ నెలాఖరు వరకు పన్నులు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలను పనులకు తీసుకురావాలన్నారు. నర్సరీల నిర్వాహణ పకడ్బందీగా ఉండాలన్నారు. అంతకు ముందు మండలంలోని ఎల్లారం శివారులోని నర్సరీని పరిశీలించారు. ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ప్రభాకరచారి, ఏపీవో తులసీరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయన్న

'డబుల్' అవకతవకలపై విచారణకు డిమాండ్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, విచారణ జరపాలని బీఎల్‌టీయూ, బీఎల్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఆశావహులతో కలిసి వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీఎల్‌టీయూ జిల్లా కార్యదర్శి సదానందం మాట్లాడుతూ..అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లను కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ దేవేందర్, పట్టణ సీఐ నరేష్‌తో వాగ్వాదానికి దిగారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు, నాయకులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బోధన్‌టౌన్: పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, స్టేషన్‌కు వచ్చిన బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని సీపీ నాగరాజు అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా బోధన్ పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌లను ఆయన బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గొడవలు జరుగుతున్న సమయంలో తప్పనిసరిగా వీడియో రికార్డు చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకతను పాటించామన్నారు. పేకాటపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఇసుక, మైనింగ్, పీడీఎస్ బియ్యం సరఫరాల విషయంలో అర్ధరాత్రి ఫోన్‌లు వస్తున్నాయని, సిబ్బందిని అక్కడికి పంపిస్తే మరో రకంగా ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. సీపీ వెంట ఏసీపీ కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బోధన్‌రూరల్: పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీపీ నాగరాజు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులు, కేసుల నమోదు, కేసుల దర్యాప్తు వంటి అంశాలను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. పెడింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీపీ వెంట ఏసీపీ కిరణ్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై సందీప్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీ నాగరాజు

జిల్లా పోలీసులకు అవార్డులు

కామారెడ్డి క్రైం: రాష్ట్ర వ్యాప్త పోలీస్ స్టేషన్ రిసెప్షన్ ఆఫీసర్ విభాగంలో జిల్లాలోని మూడు పోలీస్ స్టేషన్‌లకు అవార్డులు దక్కాయి. వాటిలో మద్నూర్, కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లకు చెందిన అధికారులు ఏకంగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వారిని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఇందుకు సంబంధించిన ఒక ప్రకటనను ఎస్పీ విడుదల చేశారు. 2022 సంవత్సరానికి రిసెప్షన్ అధికారుల పనితనాన్ని పరిశీలించి ప్రతిభ కనబరిచిన 75 మంది రిసెప్షన్ అధికారులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా మద్నూర్ ఠాణాకు చెందిన స్వప్న మొదటి స్థానం, కామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చెందిన దేవరాజ్ గౌడ్ ద్వితీయ స్థానం నిజాంసాగర్ ఠాణాకు చెందిన మంజుల 68వ స్థానంలో అవార్డు పొందారు. రాష్ట్ర పోలీస్ అకాడమీలో వీరు బుధవారం అవార్డులు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న కామారెడ్డి పోలీస్ స్టేషన్ అధికారి దేవరాజ్‌గౌడ్

ఇన్‌చార్జి డీపీవోగా శ్రీనివాస్

సుభాష్‌నగర్: ఆర్మూర్ డీఎల్పీవో శ్రీనివాస్‌కు జిల్లా పంచాయతీ అధికారి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉత్తర్వులు జారీ చేశారు. డీపీవో జయసుధ నెలరోజులపాటు సెలవులో ఉండటంతో శ్రీనివాస్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

'వినియోగదారులకు రక్షణగా చట్టం'

సుభాష్‌నగర్: వినియోగదారులకు తగిన రక్షణ కల్పించి ఏ విధంగా కూడా మోసపోకుండా ఉండేందుకు వినియోగదారుల రక్షణ చట్టం–2019 ఎంతో ఉపకరిస్తుందని డీఎస్‌వో చంద్రప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంను నిర్వహిస్తున్నమన్నారు. వినియోగదారులు హెల్ప్‌లైన్ సెంటర్ 1800114000, 1915కి డయల్ చేసి ఫిర్యాదులను నమోదు చేయొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఐసీ ఇన్‌చార్జి రాజేశ్వర్, గుజ్జ రాజేశ్వరి, డీఎం జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్‌వో చంద్రప్రకాష్

క్లుప్తంగా

సెక్యూరిటీ విధులు సక్రమంగా నిర్వహించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీని త్వరలో న్యాక్ బృందం సందర్శించనుందని, సెక్యూరిటీ గార్డులందరూ పరేడ్ ప్రాక్టీస్ చేయాలని వీసీ డి రవీందర్ సూచించారు. సెక్యూరిటీ గార్డులందరూ వర్సిటీ భద్రతను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. బుధవారం క్యాంపస్ క్రీడా మైదానంలో తెయూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వివేక్‌రాజ్ వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్‌లతో పరేడ్ నిర్వహించారు. వీసీ సెక్యూరిటీ గార్డుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. త్వరలోనే అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు. పీఆర్వో జమీల్ అహ్మద్ ఉన్నారు.

హిందీ విభాగం అధ్యక్షుడిగా జమీల్ అహ్మద్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం అధ్యక్షుడి (హెచ్‌వోడీ) గా మహ్మద్ జమీల్ అహ్మద్ నియమితులయ్యారు. బుధవారం వీసీ రవీందర్ నియామక పత్రం అందజేశారు.

17న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం 17న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డ్స్ నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాలో బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, టెలికాలర్ ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు శివాజీనగర్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయానికి రావాలన్నారు.వివరాలకు 6305743423, 9959456793, 9581768413 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గిరిరాజ్ కాలేజీలో..

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ కాలేజీలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టాస్క్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏదైనా డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు హాజరు కావాలన్నారు.

18 నుంచి సీసీ టీవీ శిక్షణ

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 13 రోజుల సీసీ టీవీ శిక్షణ ప్రారంభమవుతుందని డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తామని తెలిపారు. 19 నుంచి 35 ఏళ్ల లోపు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్ కార్డ్, ఎస్సెస్సీ ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని వచ్చి సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 08461 222428, 08461 295428 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

PASSPORT MISSING

■ జిల్ల రాజశేఖర్ S/o. జిల్ల గంగాధర్ R/o. కమ్మర్‌పల్లి, Nzb. నేను బైక్‌పై కమ్మర్‌పల్లి నుండి చౌటుపల్లి వెళ్లేటప్పుడు F4471670 నెం. గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికినవారు సంప్ర: 9966762665. [Z-772197]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586. [G-781947]

■ Wanted Computer Hardware Teachnician, CCTV Technicians, sales persons - Nizamabad. Contact: 98561 94444. [Z-772196]

■ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:18K, ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9640258899, 9640468899. [H-786847]

FACULTY TEACHERS

■ Lady Maths Lecturers Needed in Hyderabad. Salary: Rs. 40,000/-, Qual: M.Sc Maths / B.Sc Maths. ఆసక్తిగలవారు 'Math' అని 85230 58441 కు WhatsApp చేయగలరు. దయచేసి కాల్ చేయవద్దు. [B-1001]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీవార్డెన్స్, లేడీసూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931 / 9246585901 [HA-10360]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో చోటు చేసుకుంది. నగరంలోని వినాయక్‌నగర్‌లోని వైష్ణవి రెసిడెన్సీలో ఉంటున్న పెంట అనీష్(31) కడుపు నొప్పితో బాధ పడుతున్నారు. ఆస్పత్రుల్లో చూపెట్టుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతుడి తమ్ముడు అరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని నాలుగో టౌన్ ఎస్సై సందీప్ తెలిపారు.

ఇటుక బట్టీ కార్మికుడు..

మోపాల్: మండలంలోని సిర్‌పూర్‌లో ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్న బోలారం బాగ్(56) మంగళవారం అర్ధరాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఒడిశా నుంచి మూడు నెలల కిందట ఉపాధి నిమిత్తం సిర్‌పూర్ గ్రామానికి బొలారం బాగ్ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. ఇటుకబట్టీలో పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. హోలీ పండుగ నుంచి బొలారంబాగ్ అతిగా మద్యం తాగుతున్నాడు. కుటుంబ సభ్యులు మందలించడంతో మంగళవారం అర్ధరాత్రి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శాంతిబాగ్, కుమారుడు పుస్తంబాగ్ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదు ఇసుక లారీల పట్టివేత



బాన్సువాడటౌన్: బిచ్కుంద మండలం పుల్కల్ మంజీర ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు లారీలను మంగళవారం రాత్రి బిచ్కుంద పోలీసులు పట్టుకుని బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్‌కు అప్పగించారు. పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలను బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉంచారు. ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కల్వర్టుపై నుంచి పడి ఒకరి మృతి

తాడ్వాయి: మండలంలోని కృష్ణాజీవాడి శివారులోగల కల్వర్టుపై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు ఏఎస్సై సంజీవులు తెలిపారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుబ్బయ్య(40) కొన్ని రోజుల నుంచి కృష్ణాజీవాడిలో ఉంటూ చుట్టు పక్కల గ్రామాల్లో మేస్త్రీ పని చేసేవాడు. అయనకు అప్పుడప్పు ఫిట్స్ కూడా వచ్చేది. కాగా ఈనెల 14న రాత్రి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుపై కూర్చొని మద్యం తాగాడు. ప్రమాదవశాత్తు కల్వర్టుపై నుంచి కిందికి పడటంతో సుబ్బయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం కేసు నమోదు చేశామని ఏఎస్సై చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జల్లాపల్లి శివారులో ప్రధాన రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. బుధవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి వయసు 45 నుంచి 50ఏళ్లు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

డిచ్‌పల్లి: గల్ఫ్ వెళ్లి కుటుంబానికి ఆసరాగా నిలుద్దామనుకున్న ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు బలిగొంది. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి ఇంటికి వచ్చిన మర్నాడే కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బుర్రి నరేష్ (19) తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బుర్రి నర్సయ్యకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కొడుకు గల్ఫ్ ఉండగా రెండో కుమారుడు నరేష్ హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి మంగళవారమే గ్రామానికి వచ్చాడు. గల్ఫ్ వెళ్లాలని అనుకుంటున్నాడు. బుధవారం సాయంత్రం తన స్నేహితుడు తొత్తల సుదర్శన్‌తో కలిసి బైక్‌పై ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. రాత్రికి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఈద్గా వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. నరేష్ తలకు గాయమై తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందగా, సుదర్శన్ కాలు విరిగింది. సుదర్శన్‌ను అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బుర్రి నరేష్ (ఫైల్)

నాటు సారా స్వాధీనం

సిరికొండ: మండలంలోని పందిమడుగు, చీమన్‌పల్లి గ్రామాల్లో నాటు సారా విక్రయిస్తున్న కేంద్రాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్సై నర్సింలు తెలిపారు. చీమన్‌పల్లిలో మాలోతు పీరాజీ వద్ద రెండు లీటర్ల సారా, పందిమడుగులో మాలోతు బాలు వద్ద రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసులు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితులను తహసీల్దార్ గఫార్‌మియా ఎదుట బైండోవర్ చేశారు. దాడుల్లో డీటీఎఫ్ నిజామాబాద్ ఎస్సై దత్తాద్రి, సిబ్బంది లింబాద్రి, మహేష్, భువనేశ్వరి, సలీం పాల్గొన్నారు.



నిందితులతో ఎక్సైజ్ పోలీసులు